

| తేదీ | వచ్చిన ధాన్యం క్వింటాళ్లలో.. | అధికం ధర (రూ.) | తక్కువ | సరాసరి |
|---|---|---|---|---|
| 17 | 651 | 6,909 | 6,069 | 4,340 |
| 18 | 318 | 6,409 | 5,289 | 4,280 |
| 19 | 295 | 6,351 | 6,351 | 4,546 |
| 20 | 406 | 6,513, | 4,900 | 3,029 |
| 21 | 366 | 7,019 | 5,729 | 3,500 |

జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకాని ఉంచిన వేరుశనగ

- గద్వాల మార్కెట్‌లో పల్లీ రైతుల కష్టాలు
- పెరిగిన వ్యవసాయ ఖర్చులతో కుదేలు
- పెట్టుబడి రాక అప్పుల పాలవుతున్న వైనం
- 'ఈ నామ్' మార్కెట్‌లో అంతా మాయ
- దిక్కుతోచనిస్థితిలో అన్నదాతలు

# అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి

గద్వాల, ఫిబ్రవరి 21 : జిల్లాలోని మార్కెట్ యార్డులో పల్లి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఓ వైపు ప్రభుత్వం చేయూత లేక పెట్టుబడుల కోసం ఆసాముల వద్ద అప్పులు తెచ్చి పంటసాగు చేశారు. పంట చేతికి వచ్చిన తర్వాత రైతన్న మార్కెట్‌లో పంటను అమ్ముకుందామని తీసుకొస్తే అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివిలా మారింది. రైతులు పల్లిసాగు చేసే సమయంలో మార్కెట్‌లో పల్లి విత్తనాలు కొనుగోలు చేస్తే క్వింటా ధర రూ.12,500 నుంచి రూ.14,500 వరకు కొనుగోలు చేసి పల్లి పంటను సాగు చేస్తే పంట చేతి కొచ్చి మార్కెట్‌కు తీసుకొస్తే కనీసం ఆసామి వద్ద కొనుగోలు చేసిన పల్లికి సరిపోయే ధర కూడా రాకపోవడంతో రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. రైతులు పల్లీలు కొనుగోలు చేసేటప్పుడు ఉన్న ధరలు పంట పండించి మార్కెట్‌కు తీసుకొస్తే రావడం లేదని వాపోతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మార్కెట్లపై నియంత్రణ ఉంచడంతోపాటు రైతుకు మద్దతు ధర వచ్చేలా చర్యలు తీసుకొన్నది. దీనికి తోడు రైతులకు రైతుబంధు ద్వారా పెట్టుబ డి సాయం ఇవ్వడంతో రైతులు సంతోషంగా పంటలు సాగు చేసుకునే వారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్ర భుత్వంలో మార్కెట్లపై ని యంత్రణ లేకపోవడంతో మార్కెట్ యా ర్డుల్లో కమీషన్ ఏజెంట్లదే ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నది. మార్కెట్‌లోని కమీషన్ ఏజెంట్లు రింగ్ అయ్యి రైతులను నిలువునా ముంచుతున్నట్లు వాపోతున్నారు. పేరుకు మాత్రమే ఈ నామ్ మార్కెట్ గద్వాలలో కొనసాగుతున్నది. దీనికి తోడు రైతుభరోసా రెండు పంటలకు కాంగ్రెస్ ఇవ్వకపోవడంతో రైతులు పంటల సాగుకు అవస్థలు పడ్డారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో వానకాలం సీజన్‌లో 8,797 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. కేంద్రం ప్రభుత్వం ఎప్పటిలాగా రైతులు సాగు చేసిన పంటలకు మద్దతు ధర కల్పించడంలో భాగంగా పల్లీకి క్వింటాకు రూ.6,783 మద్దతు ధర ప్రకటించింది. ఆ ధర మార్కెట్‌లో రైతులకు దక్కాల్సి ఉండగా, కొనుగోలు సీజన్ ప్రారంభమైనా నాటినుంచి ఇప్పటి వరకు రోజుకు ఒకరిద్దరు రైతులకు మినహా ఏ రైతుకూ రూ.6 వేల ధర పలకడం లేదంటే పల్లి రైతుల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి జిల్లాలో పల్లి రైతులకు మద్దతు ధర కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది అనడానికి అచ్చంపేట, మహబూబ్‌నగర్ మార్కెట్లలో రైతులు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేసిన ఘటనలే నిదర్శనంగా చెప్పవచ్చు. చేతికొచ్చికొచ్చిన పంటను మార్కెట్‌లో అమ్మితే అప్పులే మిగులుతున్నాయి. గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో కొన్ని రోజులుగా పల్లి రైతులకు అందుతున్న మద్దతు ధర వివరాలు పరిశీలిస్తే అర్థమవుతుంది.

### రూ.5వేలు దాటని ధర..

ఈ సీజన్‌లో రైతులకు ఏనాడూ పూర్తిస్థాయిలో మద్దతు ధర దక్కలేదని రైతులు వాపోతున్నారు. జనవరి నుంచి ఫిబ్రవరి నాలుగో తేదీ వరకు రైతులకు పూర్తి స్థాయి మద్దతు ధర రాలేదు. ఫిబ్రవరి 18 తర్వాత మార్కెట్‌కు వేరుశనగ తక్కువగా రావడంతో రైతులకు కొంత మేర మద్దతు ధర లభించింది. సరాసరి ధరలు పోల్చితే రైతులకు ఏనాడూ రూ.5వేలు దాటలేదు. జనవరి మొదటి వారం నుంచి ఫిబ్రవరి 21వరకు ఏనాడూ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6,783 లభించలేదు. 17వ తేదీ మాత్రం ముగ్గురు రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించినట్లు తెలుస్తున్నది.

### వ్యవసాయం అంటేనే విరక్తి వస్తోంది..



ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం అంటేనే విరక్తి కలుగుతోంది. మార్కెట్‌లో పల్లీలు కొనే సమయంలో క్వింటాకు రూ.12,500 నుంచి రూ.14వేల వరకు అమ్ముతున్నారు. సాగు చేసిన పల్లీలను మార్కెట్‌కు తీసుకొస్తే కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. రెండు ఎకరాల పల్లి పంట సాగు చేశా. 28సంచుల బుడ్డలు పండాయి. ఎకరాకు సుమారుగా పల్లి విత్తనాల కొనుగోలు, ఎరువులు, కూలీలు, గెడాలు అన్ని కలిపితే ఎకరాకు సుమారుగా రూ.50వేల పెట్టుబడి అయ్యింది. పంటను అమ్మితే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. దీనికి తోడు రెండు విడుతలుగా రైతు భరోసా కూడా రాకపోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది.

– సత్యారెడ్డి, రైతు, మార్లబీడు

### అప్పులే మిగిలాయి..



ఆశ చావక రైతులు పంటలు సాగు చేస్తే చివరికి అప్పులే మిగులుతున్నాయి. రెండెకరాలు పల్లీ పంట సాగు చేయగా, 20సంచుల వేరుశనగ బుడ్డలు పండాయి. ఎకరాకు సుమారు రూ.40వేల పైనే పెట్టుబడి పెట్టాం. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం లేదు. మార్కెట్‌కు వేరుశనగ తెస్తే ధరలు లేవు. పండిన పంట అంతా ఆసామి అప్పుకు సరిపోవడం లేదు. దీంతో ఏం చేయాలో తోచడం లేదు. వ్యవసాయ ఖర్చులు పెరగడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. రైతులకు ప్రభుత్వపరంగా చేయూత లేకపోవడంతో వ్యవసాయం చేయాలంటే ఆలోచిస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులకు చేయూతనిచ్చి ఆదుకోవాలి.

– తాయన్న, రైతు, మిట్టదొడ్డి

# పాలమూరుకు సీఎం చేసిందేమిటీ..?

- కాంగ్రెస్ అంటేనే మోసం
- రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు
- రైతుభరోసాతో అన్నదాత ఆగం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరు బిడ్డగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఒ రగబెట్టింది ఏమున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అంటేనే పచ్చి మోసమని, ఆకలి చావులు, ఫ్లోరైడ్ మహమ్మారి, కరువు పరిస్థితులకు నిలువుటద్దమని సింగిరెడ్డి విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్‌తో కలిసి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలప్పుడు పాలమూరు బిడ్డనంటూ పదేపదే.. ప్రచారం చేసుకున్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు సీఎంగా పాలమూరుకు ఒరగబెట్టింది ఏమున్నదన్నారు. మెజార్టీ పనులు పూర్తి చేసుకున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం గురించి ఒక్కరోజైన చర్చించలేదన్నారు. ఈ ప్రాజెక్టు నుంచి సాగునీటిని వాడుకునే అవకాశం ఉన్నా.. రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రకటనలతో వాస్తవాలను పక్కకు పెడుతూ గత ప్రభుత్వం అంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 90శాతం పనులు పూర్తయిన పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీటి వినియోగం లేకుండా ఏడాదిపాటు నిర్లక్ష్యం చేశారన్నారు. 2015లో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారని, ఈ ప్రాజెక్టుపై అనేక ఫిర్యాదులు చేసి కాంగ్రెస్ నిధులు రాకుండా ఆటంకాలు కల్పించే ప్రయత్నం చేసినా.. రాష్ట్ర నిధుల నుంచే ఖర్చు చేయాలని నాటి కేబినెట్ నిర్ణయం తీసుకున్నదని నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. అలాగే పర్యావరణ శాఖ వెయ్యి కోట్ల జరిమానా విధించేలా చేసిన కుట్రలన్నీ పటాపంచలు చేసి మెజార్టీ పనులను చేశారన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడిన మాటలు శుద్ధఅబద్ధాలు అని నిరంజన్‌రెడ్డి కొట్టిపారేశారు. ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి వాటాను కొల్లగొడుతుంటే.. సీఎం, మంత్రులు మౌనం దాల్చారన్నారు. ప్రజాసమస్యలను పక్కదారి పట్టించడం కోసం ఏ సమస్య వచ్చినా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గత ప్ర భుత్వం అంటూ నోరు పారేసుకుంటున్నాడన్నారు. నాగార్జునసాగర్ నుంచి ప్రతిరోజు 10 వేల క్యూసెక్కుల నీటిని ఏపీ ప్రభుత్వం తరలిస్తుంటే ఎందుకు మాట్లాడటం లేదన్నారు. అభివృద్ధిబాట పట్టిన రైతులను మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచన చేస్తున్నదని, 3 ఎకరాల వరకు రైతుభరోసా వేశామని చెబుతున్న ప్రభుత్వం అక్షరాల తొమ్మిదిన్నర లక్షల మంది రైతులను వివిధ కారణాల పేరుతో తొలగించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ రంగం డమాల్ అయ్యిందని, సేద్యం కుప్పకూలుతున్నది, రైతులు, విద్యార్థులు, ఆటో డ్రైవర్ల మరణాలు, మహిళలు, వృత్తిదారులు, చివరకు వృద్ధులు సైతం ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఇలా రాష్ట్రంలో ఏ ఒక్కరూ కాంగ్రెస్ పాలనలో సంతోషంగా లేరన్నారు. సముద్రంలోకి వెళ్లే నీటిని తీసుకుంటున్నామని ఏపీ సీఎం చంద్రబాబు చెబుతుంటే, రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నట్లు అని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఇక్కడి పొలాలు ఎండుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో ఆకలి చావులు, అంబలి కేంద్రాలు, కరువు, వలసల ముఖచిత్రంగా కాంగ్రెస్ పాలనలు కొనసాగాయని, రాష్ట్ర సాధన అనంతరం వాటిని రూపుమాపి అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్న వేళ ఇలా.. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ తెలంగాణను నాశనం చేస్తున్నదన్నారు. ఏపీ అధికంగా వాడుతున్న సాగునీటిపై పోరాటం చేయాలని, పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో అడుగడుగునా కేసీఆర్ ప్రతిబింబం కనిపిస్తుందన్నారు. నేడు సాధారణ రైతులు కూడా క్యూసెక్కులను మాట్లాడుతున్నారంటే, అది కేసీఆర్ చేపట్టిన గత జలసాధన ఉద్యమ ఫలితమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో తలసరి ఆదాయం పడగొట్టేలా కాంగ్రెస్ పాలన సాగుతుందని, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సాగునీళ్లు ఇచ్చిందని చెప్పడం సిగ్గు చేటన్నారు.

సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మయ్య, కురుమూర్తి, కృష్ణనాయక్, రఘుపతి రెడ్డి, కర్రెస్వామి, విజయ్ కుమార్, అశోక్, రాము, దిలీప్‌రెడ్డి, పరంజ్యోతి, జోహెబ్, రహీం తదితరులు పాల్గొన్నారు.

# అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

- జిల్లా స్థాయిలోనూ 1912 విద్యుత్ కాల్ సెంటర్ సేవలు
- దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ



జిల్లా ఎస్ఈ ఆఫీస్‌లో కంట్రోల్ రూం ప్రారంభిస్తున్న చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫారూఖీ, ఎస్ఈ పీవీ రమేశ్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 : డిమాండ్‌కు అనుగుణంగా ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ సూచించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్ఈ పీవీ రమేశ్‌తో కలిసి టీడీగుట్ట సబ్‌స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను, జిల్లా విద్యుత్ కార్యాలయంలో ఆధునీకరణ పనులు చేపట్టిన కంట్రోల్ రూంను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా జిల్లాలో జరుగుతున్న సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఎలాంటి ఓవర్ లోడ్ సమస్యలు లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు జాగ్రత్తలు చేపట్టామన్నారు. హైదరాబాద్ నగరానికే పరిమితమైన 1912 విద్యుత్ కాల్ సెంటర్ జిల్లాలకు విస్తరించినట్లు తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 15వేల మంది వినియోగదారుల చేరికతో మొత్తం వినియోగదారుల సంఖ్య 3.99 లక్షలకు చేరిందన్నారు. జిల్లాలో విద్యుత్ వినియోగం, సరఫరా, అంతరాయం లేకుండా చేపడుతున్న చర్యలు, వేసవిలో విద్యుత్ సరఫరా యాక్షన్‌ప్లాన్ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, విద్యుత్ సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్స్) డా.నర్సింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ బాలస్వామి, మహబూబ్‌నగర్ ఎస్ఈ పీవీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీపై క్రిమినల్ కేసు పెట్టాలి



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న అధికారులు, పోలీసులు

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 21 : ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థులు అస్వస్థతకు గురైన యూనివర్సిటీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. శుక్రవారం జడ్చర్ల సమీపంలోని పోలేపల్లి సెజ్‌లో ఉన్న ఎన్‌ఎంఐఎంఎస్‌యూ ఎదుట ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకులు ధర్నా చేపట్టారు. యూనివర్సిటీలో గురువారం విద్యార్థులు అస్వస్థతకు గురవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థుల వద్ద రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేసి నాసిరకం భోజనం అందిస్తున్న యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ధర్నా విషయం తెలుసుకున్న జడ్చర్ల ఎస్సై జయప్రసాద్‌తోపాటు యూనివర్సిటీ యాజమాన్యం అక్కడికి చేరుకొని వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఇదిలా ఉండగా యూనివర్సిటీలో శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురైన మరో 10 మంది విద్యార్థులను చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు సమాచారం.

### బీఆర్‌ఎస్ నేతల పరామర్శ

పోలేపల్లి సెజ్‌లోని ఎన్‌ఎంఐఎంఎస్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు అస్వస్థతకు గురై జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని బీఆర్‌ఎస్ నేతలు యాదయ్య, సుదర్శన్‌గౌడ్, ఇంతియాజ్, నాగిరెడ్డి, కరాటే శ్రీను వెళ్లి పరామర్శించారు. అస్వస్థతకు గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత దవాఖాన యాజమాని రాంరెడ్డితో మాట్లాడి మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని సూచించారు. యాజమాన్యంతో మాట్లాడి ఇలాంటి ఘటనలు పునావృతం కాకూడదన్నారు.

### పేట–కొడంగల్ భూ నిర్వాసితులకు దక్కని భరోసా..

నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయే రైతులకు నారాయణపేట పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఏదైనా భరోసా దక్కుతుందా? అని ఎదురు చూసిన రైతులకు ఎలాంటి భరోసా దక్కకపోవడంతో తీవ్ర నిరాశతో వెనుతిరిగారు. భరోసా ఇవ్వకపోగా పై నుంచి దామరగిద్ద తండాకు చెందిన రైతులను సీఎం పర్యటన దృష్ట్యా ముందస్తు అరెస్టు చేయడం కొసమెరుపు. బాబు నాయక్‌తోపాటు పలువురుని పోలీసులు అదుపులోకి తీసుకొని సాయంత్రం వదిలపెట్టారు. ప్రాజెక్టు ఏర్పాటుతో భూములు కోల్పోయే రైతులు, ఎట్టి పరిస్థితుల్లో తమ భూములు ఇచ్చేది లేదని, ఏండ్ల తరబడి భూమినే నమ్ముకొని తాము జీవనం కొనసాగిస్తున్నామని తెగేసి చెబుతున్నారు.

# ఆశలన్నీ అడియాశలే..

- నారాయణపేట పర్యటనలో సీఎం నోటి నుంచి రాని హామీల మాట
- ఊసెత్తని మూడు మండలాల ప్రకటన
- భూ నిర్వాసితులకు దక్కని భరోసా
- రేవంత్ ప్రసంగిస్తుండగానే సభ నుంచి వెళ్లిపోయిన జనం



నారాయణపేట సభలో సీఎం ప్రసంగిస్తుండగా బయటకు వెళ్తున్న మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

నారాయణపేట, ఫిబ్రవరి 21 : నారాయణపేట జిల్లా పర్యటనలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో హామీలు ఇస్తారని ఎంతో ఆశతో ఎదురు చూసిన జనానికి నిరాశే ఎదురైంది. ఒక్క హామీ కూడా ఇవ్వకుండా.. కేవలం రాజకీయ ప్రసంగం మాత్రమే చేసి వెళ్లడంతో ముఖ్యమంత్రి పర్యటన కాస్తా జై తుస్‌గా మారిందని సభకు వచ్చిన జనం చర్చించుకోవడం కనిపించింది. ముఖ్యంగా మూడు మండలాల ప్రకటన వెలువడుతుందని అందరూ భావించారు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నారాయణపేట మండలంలోని కోటకొండ, దామరగిద్ద మండలంలోని కాన్‌కుర్తి, కోయిలకొండ మండలం గార్లపాడ్‌ను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి నారాయణపేటకు పీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చిన రేవంత్ స్వయంగా ప్రకటించారు. అయితే కోటకొండ మండలం కోసం ఇటీవల ఆయా గ్రామాల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు ఆందోళన చేపట్టగా, కాంగ్రెస్ జిల్లా నేత జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి నోటి ద్వారా త్వరలోనే మూడు మండలాల ప్రకటన చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సీఎం పర్యటనలో మూడు మండలాల ప్రకటన ఉంటుందని భావించినా రాకపోవడంతో జనం నిట్టూర్చారు. అంతకు ముందు సభ వేదిక మీద మాట్లాడిన స్థానిక శాసన సభ్యురాలు పర్ణికారెడ్డి సైతం మూడు మండలాల గురించి మాట్లాడకపోవడం ఆయా మండలాల నాయకులకు, ప్రజలకు విస్మయానికి గురిచేసింది. ఇతర సమస్యల గురించి ప్రస్తావించినా, తమకు ముఖ్యమంత్రి ద్వారా మండలాల ప్రకటన చేయిస్తామని చెప్పి కూడా ఎందుకు ప్రస్తావించలేదని, ఒక సమయంలో ఎమ్మెల్యే ప్రసంగం ముగిసిన తర్వాత మండలాల గురించి ప్రస్తావించాలి మేడం అంటూ జనం మధ్యలో నుంచి గట్టిగా ఎవరో అరిచినా పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి మాట్లాడుతున్న సమయంలో కూడా కొంత మంది ప్లకార్డులు పట్టుకొని డిమాండ్ చేసినా.. మూడు మండలాల ప్రకటన ముఖ్యమంత్రి పర్యటనలో అడియాశగానే మిగిలిపోయిందని చెప్పొచ్చు.

### 'సంగంబండ' నీటి విడుదలపై నోరుమెదపని సీఎం

నారాయణపేట జిల్లా మక్తల్ మండలం సంగంబండ రిజర్వాయర్ నుంచి నీటి విడుదలలో అంతరాయం కారణంగా ఆందోళన చెందుతున్న మక్తల్ మండల పరిసర గ్రామాలకు చెందిన వరి రైతులు, నీటి విడుదలపై ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశిస్తారని ఆయా రైతులు భావించినా కనీసం సీఎం ఈ విషయంపై నోరు మెదపలేకపోవడం గమనార్హం. రిజర్వాయర్ మీద ఆధారపడి పంటలు వేశామని, అకస్మాత్తుగా నీటి విడుదలలో అంతరాయం ఏర్పడడంతో దిక్కుతోచడం లేదని పలువురు కర్షకులు వాపోయారు.

### సీఎం ప్రసంగిస్తుంటే.. బయటకెళ్లిన జనం

నారాయణపేటలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే జనం పెద్ద ఎత్తున బయట కు వెళ్లిపోయారు. దీంతో సభా ప్రాంగణంలోని రెండు, మూడు గ్యాలరీలు ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చాయి. అనుమతి పాసులున్నా సభా వేదిక ప్రాంగణంలోకి జనాన్ని అనుమతించకపోవడంతో పోలీసు జులుం నశించాలి.. పోలీసులు డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎంతో అభివృద్ధి చేస్తున్న సీఎంకు లేచి నిలబడి కృతజ్ఞతలు తెలపాలని, ఎ మ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేసినా వారి నుంచి స్పందన రాలేదు. రుణమాఫీ కింద నియోజకవర్గంలో రూ.200 కోట్లు మాఫీ అయ్యాయని, మరో రూ.50 కోట్లు మాఫీ కావాల్సి ఉన్నదని, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రస్తావించడం చూస్తుంటే సీఎం, మంత్రుల సాక్షిగా 100 శాతం రుణమాఫీ కాలేదని ఒప్పుకున్నట్లు అయ్యింది.

# పోటాపోటీగా.. పొట్టేళ్ల పోట్లాట



తలపడుతున్న పొట్టేళ్లు

- తరలొచ్చిన 20 పొట్టేళ్లు
- మొదటి విజేత అయిజ
- రెండో విజేత హైదరాబాద్

అయిజ, ఫిబ్రవరి 21 : పొట్టేళ్ల పొట్లాట పోటాపోటీగా సాగింది. పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర పొట్టేళ్ల పొట్లాట పోటీలు నిర్వహించారు. పొట్టేళ్లతో సాగిన పోరు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. పొట్టేళ్లు ఒకదానికొకటి తలపడుతుండగా చూసేందుకు ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలొచ్చారు. ఈ పోటీలకు తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి 20 పొట్టేళ్లు తరలొచ్చాయి. పోటీల్లో మొదటి బహుమతిగా అయిజ పట్టణానికి చెందిన డల్ల నర్సింహులు (సుల్తాన్) (రూ.50, 016)కు చెందిన పొట్టేలు, రెండో బహుమతి హైదరాబాద్‌కు చెందిన రాజవల్లి కిల్లర్ గ్రూప్ (రూ.35,016)కు చెందిన పొట్టేలు, మూడో బహుమతి హైదరాబాద్‌కు చెందిన ఎంజే గ్రూప్ (రూ.20,016), నాలుగో బహుమతి హైదరాబాద్‌కు చెందిన క్రైమ్‌మేకర్స్ ప్రూప్ (మచ్చ)–375) (రూ. 10,016) పొట్టేళ్లు కైవసం చేసుకున్నాయి. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.

# మళ్లీ.. మళ్లీనా..?

- చేసిన పనులకే రెండుసార్లు శంకుస్థాపనలా..?
- 2023లోనే పామాయిల్ కంపెనీకి కేటీఆర్‌చే భూమిపూజ
- నేడు మంత్రి తుమ్మలతో మరోసారి ప్రారంభమా..?
- గత పనులను తామే చేస్తున్నట్లు కాంగ్రెస్ నేతల షో..

వనపర్తి, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన పనులకే మళ్లీ పూజలు నిర్వహిస్తుండడం విమర్శలకు దారి తీస్తుంది. నూతన ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం చెప్పుకోదగ్గ పనులు మొదలు కాలేదు. గతంలో శంకుస్థాపనలు చేసిన పనులు ప్రారంభిస్తే.. బీఆర్‌ఎస్‌కు పేరొస్తుందని, ప్రభుత్వ, ప్రైవేట్ పనులకు ఫుల్‌స్టాప్ పెట్టారు. జిల్లాలోని మరికొన్ని చోట్ల టెండర్లు పూర్తి అయిన పనులను సైతం రద్దు చేయిస్తున్నారు. ఈ క్రమంలో 14 నెలలు గడుస్తున్నా.. అభివృద్ధి జాడ లేకపోవడంతో మళ్లీ చేసిన పనులకే పూజలు చేస్తూ తామే చేస్తున్నామన్నట్లు కనిపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు గుప్పిస్తున్నారు. జిల్లా పరిధిలోని కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి శివారులో పామాయిల్ కంపెనీకి 2023 సెప్టెంబర్ 28న అప్పటి వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి నాటి ఐటీశాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అప్పుడు ప్రీ యూనిక్ ఇండియా లిమిటెడ్ కంపెనీయే ఈ పనులను చేపట్టి శ్రీకారం చుట్టింది. దీని అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ కంపెనీ పనులకు బ్రేకులు పడ్డాయి. ఇది ప్రైవేట్ కంపెనీ, పనులు చేసేందుకు కంపెనీ ఆసక్తిగా ఉన్నప్పటికీ పలు ఆటంకాలు ఎదురు కావడంతో ముందుకు సాగనివ్వలేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం పామాయిల్ తోటలను పెంచటంపై ప్రత్యేక చొరవ అన్నట్లు కనిపిస్తున్నా.. ఇలా కంపెనీ పనులు మొదలు కాకుండా ఇంతకాలం నిలిపివేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ జోక్యం వల్లే పనులు ముందుకు సాగలేదన్న వాదనలు వినిపించాయి. ప్రభుత్వ సహకారం అంది ఉంటే ఇప్పటి వరకే పామాయిల్ కంపెనీ ఏర్పాటై ఉండేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఇదిలా ఉంటే.. మళ్లీ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు శనివారం ఇదే పామాయిల్ కంపెనీ కోసం ప్రీ యూనిక్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలోనే పనులకు మళ్లీ పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది. దాదాపు రూ.200 కోట్లతో ఈ కంపెనీ ఏర్పాటుకు గతంలోనే కార్యాచరణ జరిగింది.



కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి శివారులో ప్రీయూనిక్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం కంపెనీ పనులకు భూమి చేస్తున్న కేటీఆర్(ఫైల్)